విజయగర్వంతో నవ్వుతోందామె.

"వచ్చే జన్మలో మీరు ద్రౌపది అయి పుడతారు. చూస్తూండండి" అన్నాడు కసిగా.

"వచ్చే జన్మ సంగతేమోగానీ ముందిప్పుడు మీ సత్యభామ తన్నులనుంచి తప్పించుకోండి" హేళనగా నవ్వుతోంది.

ఇంట్లోకొచ్చేసరికి తులసి కోపంగా మంచం మీద కూర్చుని ఏదో నవల చదువుతోంది. ప్రక్కనే కూర్చున్నాడు సురేష్ .

"సీన్ ఎప్పుడు స్టార్టవుతుంది?" అడిగాడు సీరియస్‌గా.

"ఏం సీన్?"

"అదే-సత్యభామ కృష్ణుడిని తన్నే సీను."

ఆమె నవ్వలేదు "మళ్ళీ తాగావు కదూ?"

"ఇదే లాస్ట్ అని చెప్పమన్నాడు డార్క్ డెవిల్."

"ఆ షర్ట్ సంగతేమిటి?"

సురేష్ రాకూడదని కోరుకుంటున్న క్షణం రానే వచ్చింది.

"ఏ షర్ట్?"

"అదే తెలీనట్లు బుకాయించకు."

"అదా- దాని మీద లిప్‌స్టిక్ అంటుకుంటేనూ-చిరాకు పడతావని...."

"సురేష్!" అతనివంక చూడకుండానే పిలిచిందామె.

"ఎస్ డియర్!" ఆమెను తనవేపు తిప్పుకోబోయాడుగాని అతని  చేతులు తోసివేసింది.

"నిజం చెప్పు ఇంత రాత్రివరకూ ఎక్కడున్నావ్?"

"టు టెల్ యూ ది ఫాక్ట్."

"తెలుగులో మాట్లాడు."

"ఇలాంటి సమయంలో ఇంగ్లీషు వాడాలని చెప్పాడే భవానీ శంకర్."

"టు హెల్ విత్ భవానీశంకర్? ముందుచెప్పు."

"అనుకోకుండా అంటే అయ్‌మీన్ తెలీకుండా నటాషా గదిలో గడిపాను. నిజమే చెపుతున్నాను. అక్కడికెలా వెళ్ళాను, ఎందుకెళ్ళానో నాకే తెలీదు."

"నాకు తెలుసు-తాగితే నువ్విలాంటిదేదో చేస్తావని."

"అబ్బే ఏమీ చేయలేదు ప్రామిస్" మళ్ళీ ఆమె నడుము మీద చెయ్యి పడింది.

"మరి?" అతని చేతిని తోసివేస్తూ అందామె.

"తమాషా ఏమిటంటే నాకు నిద్ర మెలకువ వచ్చేసరికి పక్కన రాజ్యలక్ష్మి వుంది నటాష కాదు."

"నీకంటే బటర్‌ఫ్లై కంటే నేనే నయం"

ఆమె సీరియస్‌గా చూసింది.

"నిజం తులసీ! నాకేమీ తెలీదు. కళ్ళు తెరిచేసరికి చీకటి. పక్కనున్నది నువ్వే అనుకుని మన అలవాటు ప్రకారం నీ మోకాలు..."

తులసి ఎంత ప్రయత్నించినా నవ్వాపుకోలేకపోయింది.

"నిజం డియర్!"

"మరీ సత్యహరిశ్చంద్రుడులాగా ఫోజు పెట్టకు."

"సత్యహరిశ్చంద్రుడు నటాషా రూమ్‌లో ఎప్పుడూ లేడు కదా?"

మళ్ళీ నవ్వు-ఆపడానికి వృధాగా ప్రయత్నిస్తూ.

ఫరవాలేదు. కరిగిపోతోంది. ఇంకొంచెంసేపు మాట్లాడితే చాలు.

"అయినా నీ కొలతల ముందు రాజ్యలక్ష్మి కొలతలు బలదూర్."

"యూ సిల్లీ!"

"నో! రియల్లీ! ఎంత చీకటిగా వున్నా ఐ కెన్ మెజర్! గాడ్స్‌గిఫ్ట్ అది. అందరూ చేయలేరు" ఆమె పెదాలు అందుకున్నాడు

తల వెనక్కు జరిపిందామె.

"నువ్వూ అందరి మగాళ్ళలాంటివాడివే కదూ?"

"మిగతా అందరి సంగతి నీకెలా తెలుసు?"

"షటప్!"

"అంటే కోపం పోయినట్లేనా?"

"నాతో మాట్లాడద్దు"

"ఫెంటాస్టిక్!"

"బెడ్‌రూమ్‌లో మాట్లాడకుండా వుండటమే నాకిష్టం అసలు."

అతని చేతులు విసిరికొట్టింది.

"సురేష్" అంది అసహనంగా.

"వెరీగుడ్! ట్రాక్‌లో కొచ్చేశావ్! ఇంకో రెండుసార్లు పేర్లు పిలుచుకుందాం!"

సురేష్ .....

తులసీ....

సురేష్ ....

తులసీ....

అప్పుడు కౌగిట్లో ఇరుక్కుపోతాం ఇంకో రెండుసార్లు సురేష్ ....

తులసీ....

సురేష్ ....

తులసి ....

అప్పుడు పక్క మీదకు ఇలా వాలిపోతాం. నువ్వు నా చెవిదగ్గర మెత్తగా, మెల్లగా అంటావు.

సురేష్ యూ ఆర్ రియల్లీ వండర్ ఫుల్.

'యాజ్ లాంగ్ యాజ్ యూ విష్' అంటాన్నేను.

"అబ్బా-సురేష్ ఇంకా దగ్గరకు రావూ..."

తులసి నవ్వాపుకుని అతని చేతిని తన గుండెలకేసి అదిమి పట్టుకుంది.

"ఇంకోసారి ఇలా జరగదని ప్రామిస్ చేయ్."

"అంటే ఇంకోలా జరిగితే ఫర్లేదా? అలా కోపంగా చూడకు.. నా ఉద్దేశ్యం ఏమిటంటే... ప్రామిస్ ప్రామిస్.... అయినా నీఅంత అందమైన అమ్మాయిని ఇంట్లో పెట్టుకుని ..నేనేం పిచ్చివాడినా చీకటి రూమ్స్‌లో గడపడానికి?"

తులసి అతనివేపుకి తిరిగి పెదాల మీద ముద్దు పెట్టుకుంది.

సురేష్ ఆనందంగా రొటీన్‌లోకొచ్చేశాడు.

వేడిగా ఉచ్ఛ్వాస నిశ్వాసలూ.

రహస్య కలవరింతలూ,

తామిద్దరూ బ్రతుకుతోంది ఈ క్షణాల కోసమే అన్నట్లు... పైగా ఇవే ఆఖరిసారి అనుభవించే క్షణాలయినట్టూ... ప్రతిసారి లాగానే ఒకర్లో ఒకరు లీనమైపోతూ, ఒకరినొకరు తమలో ఐక్యం చేసుకోవాలని ప్రయత్నిస్తూ....

తలుపు మీద సున్నితంగా తట్టిన చప్పుడు....

ఒక్క ఉదుటున కౌగిలి విడిపోయింది,

"ఎవరు?" మత్తుగా, నెమ్మదిగా అడిగింది తులసి అతనిని.

"బహుశా పాలపాకెట్ అయుంటుంది."

"అప్పుడేనా?"

"ఈ మధ్య ఫామిలీప్లానింగ్ కూడా వాళ్లకే యిచ్చారేమో?"

సురేష్ లేచి వెళ్ళి తలుపుసందులో నుంచే చేయి బయటకు పెట్టాడు పాలపాకెట్ కోసం.

అతని చేతిని ఎవరో గిల్లేసరికి అదిరిపోయి వెనక్కు లాక్కుని బయటకు చూశాడు.

గంగాభవాని నవ్వుతోంది.

"తలుపులు మూయటం మర్చిపోయినట్లున్నారు గుర్తు చేద్దామని....."

"అబ్బే మర్చిపోలేదు."

ఆమె విసురుగా వెళ్ళిపోయిదక్కడినుంచి.

సురేష్ అంతకంటే విసురుగా తలుపులు మూసివేశాడు.

"యాంటీ క్లెయిమాక్స్" అంది తులసి మంచం మధ్యలో కూర్చొని తృళ్ళి తృళ్ళి నవ్వుతూ.

*　　　*　　　*　　　*

సుష్మా నర్శింగ్‌హోమ్ చాలా అందమయిన బిల్డింగ్‌లో వుంది .

ఎంట్రెన్స్ పక్కనే ఓ అమ్మాయి కూర్చుని వుంది. టేబుల్ ముందు సింపుల్‌గా, అందంగా, వ్యాపార పద్ధతిగా మాట్లాడుతూ.

"ఎస్ ప్లీజ్!" అంది సురేష్‌ని చూస్తూ ప్రశ్నార్ధకంగా.

నటాషా అందం, కాబరే రూపం ఆమెకు వింతగా వున్నట్లున్నాయ్.

"డాక్టర్ కుమారి..."

"ఓ డాక్టర్ కుమారీస్ కేస్"

"వన్ థౌజెండ్ రూపీస్ కట్టండి"

"రైల్వేవాళ్ళు, ఆర్టీసీవాళ్ళూ ఇస్తూంటారు. విద్యార్ధులకు కన్సెషన్ అనీ, అలాంటిదేమీ మీ దగ్గర లేదా?"

ఆమె నవ్వుతూ చూచిందతని వేపు.

"మైగాడ్-మీరు స్టూడెంట్సా?"

"నోనో ప్రస్తుతం కాదనుకోండి! వన్స్ అపాన్ ఎ టైమ్"

అతను వెయ్యి రూపాయలు, నటాషా ఇచ్చిన డబ్బు ఆమె లెక్క పెట్టుకుంటూంటే అడిగాడు.

"పర్‌ఫెక్ట్‌గా చేస్తారా?"

"ఓ ఎక్సలెంట్ డాక్టర్! సిక్త్స్ మంత్‌లో కూడా ఈజీగా చేసేస్తుంది. వెళ్ళి ఆ చివర రూమ్‌లో కూర్చోండి."

సురేష్, నటాషా చివరి రూమ్‌లో కొచ్చారు.

అప్పటికి అక్కడ మరో ఇద్దరు యువతులు కూర్చుని వున్నారు.

"మీరు కూడా డాక్టర్ కుమారి కేసేనా?" ఓ యువతి అడిగింది.

"అవును..." అంది నటాషా.

"డబ్బంటే తెగ ఆశ...."

నటాషా ఆశ్చర్యపోయింది.